క్లుప్తంగా

20న బంగ్లే షావలి ఉరుసు

కడప కల్చరల్ : కడప గండి వాటర్‌వర్క్స్ వద్ద గల హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అబ్దుల్ ఖాదర్ హుసేనీ చిష్తివుల్ ఖాద్రి రహమతుల్లా అలై ఉరఫ్ బంగ్లే షావలి ఉరుసు ఈనెల 20న నిర్వహించనున్నట్లు పెద్దదర్గా ముజావర్ అమీర్ తెలిపారు. ఉత్సవంలో భాగంగా ఆస్థానె మగ్దూమ్ ఇలాహి అమీన్‌పీర్ (పెద్ద) దర్గా సజ్జాద నషీన్ హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరీఫుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ సాహెబ్ ఇంటి నుంచి గంధం కలశాన్ని ఫకీర్ల మేళతాళాల మధ్య గండి గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి దర్గాకు చేర్చనున్నట్లు తెలిపారు. అనంతరం గంధాన్ని గురువుల మజార్‌పై సమర్పించి ఫాతెహా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాత్రి 9 గంటలకు ప్రముఖ ఖవ్వాలీ గాయకుల కవేరీ ఉంటుందని తెలిపారు.

డీఎస్పీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన కడప డీఎస్పీ ఎండీ షరీఫ్‌ను ఆదివారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఐసీసీ మెంబర్ బండి జకరయ్య, బండి సుమంత్ కుమార్, తిరుమలేష్, వంశీ, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

కడప ఎడ్యుకేషన్: కార్పొరేట్‌లో పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లను విద్యాశాఖ అధికారులు అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా కడప నగరంతోపాటు రాయచోటి, రాజంపేట, పొద్దుటూరు, బద్వేల్, మదనపల్లె ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ పాఠశాలల యజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పెద్దపెద్ద హోర్డింగులను ఏర్పాటు చేసి ప్రచారాలను హోరెత్తిస్తున్నారన్నారు. ఇప్పటికే సగం కార్పొరేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేశాయని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా నాయకుడు స్వరూప్ పాల్గొన్నారు

19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: సీపీఎం కార్యాలయంలో ఈ నెల 19న నిర్వహించే పుచ్చలపల్లి సుందరయ్య సభను జయప్రదం చేయాలని సీపీఎం నగర కమిటీ సభ్యులు ఓబులేసు పేర్కొన్నారు. ఈ మేరకు సభను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాలల్లో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఆచరించిన సిద్ధాంతాలు, విలువలు నేటికీ ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనలు రేకెత్తించే క్రీడలు ఆడాలి

కమలాపురం : విజ్ఞానం, ఆలోచనలు రేకెత్తించే క్రీడలు, ఆటలు ఆడాలని కమలాపురం శాఖ గ్రంథాలయాధికారి నాగాంజలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన సదస్సులో భాగంగా ఆదివారం విజ్ఞానం, ఆలోచనలు రేకెత్తించే క్యారమ్స్ తదితర ఆటల్లో ఆమె విద్యార్థులకు శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువులోనే కాకుండా వివిధ క్రీడాంశాల్లో సైతం ప్రతిభ చూపాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ట్యాలీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: నగరంలోని ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ట్యాలీ, కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమో,డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 18-26 ఏళ్ల లోపు కలిగిన వారు అర్హులు.35 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. వివరాలకు 90004 87423 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

21న దూదేకుల విద్యార్థులకు ప్రోత్సాహకం

కడప రూరల్: పదో తరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ చాటిన నిరుపేద దూదేకుల విద్యార్థులకు ఈ నెల 21వ తేదీన ప్రోత్సాహక బహుమతులను అందిస్తున్నట్లు నూర్ బాష్ దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గుటూరు రాజా, గౌరవ సలహాదారులు ఆయిల్ మిల్ ఓబులేసు తెలిపారు. ఆదివారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు 10వ తరగతిలో 550, ఇంటర్‌మీడియట్‌లో 900 మార్కులకు పైగా సాధించిన దూదేకుల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు. ఈ నెల 19వ తేదీలోపు అర్హులైన విద్యార్థులు మార్కుల జాబితాను కడప ఎర్రముక్కపల్లెలో గల దూదేకుల భవన్‌లో అందజేయాలన్నారు. అర్హులైన విద్యార్థులకు ఈ నెల 21వ తేదీన దూదేకుల భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ప్రోత్సాహక సత్కారం కార్యక్రమం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9652221967 ను సంప్రదించాలని తెలిపారు.

పవన సుతునికి ప్రణతులివే!

- భక్తిశ్రద్ధలతో పూజలు
- ఘనంగా హనుమజ్జయంతి



కో ఆపరేటివ్ కాలనీలోని శ్రీ షిరిడిసాయి ఆలయంలో విశేష అలంకారంలో హనుమంతుడు

కడప కల్చరల్ : స్వామి భక్తి, కార్యదక్షత, అమేయ శక్తిసంపదలకు ప్రతిరూపమైన పవన కుమారుడు హనుమంతుడికి హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. కడప నగరంలోని అన్ని ఆంజనేయస్వామి ఆలయాలు, రామాలయాలలో ప్రత్యేక పూజలు, అలంకారాలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి స్వామి మూల విరాట్‌కు అభిషేకాలు చేసి కనుల పండువగా అలంకారం నిర్వహించారు. పలు ఆలయాలలో భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు సమర్పించిన వడలను మాలలుగా స్వామికి అలంకరించారు. మరికొన్నిచోట్ల భక్తులు స్వామికి ఆకుపూజ, కుంకుమపూజ, సింధూర పూజలను నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. దాదాపు అన్ని ఆంజనేయస్వామి ఆలయాలను వెలుపల భారీ స్వాగత తోరణాలు, లోపల పూలు, ఇతర అలంకారాలు చేయడంతో ఆ ప్రాంగణాలు కళకళలాడాయి. కొన్ని ఆలయాల వద్ద ఉదయం, సాయంత్రం భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, గణపతిపూజ, మన్యసూక్తహోమం, కలశ స్థాపన, దీపోత్సవం తదితర పూజలు చేశారు. కొన్నిచోట్ల పలు రంగుల ముత్యాలతో, మరికొన్నిచోట్ల నాగవల్లీ దళాలు (తమలపాకులు) తదితరాలతో ప్రత్యేక అలంకారం నిర్వహించారు. దాదాపు అన్ని ఆలయాల వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదానాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తబృందాలు భజనలు నిర్వహించారు. నగరంలోని గడ్డిబజారులోగల శ్రీ సోమసుందరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోగల శ్రీ అభయాంజనేయస్వామికి హనుమాన్ జయంతిని పురస్కరించుకుని విశేష అలంకారం, పూజలు నిర్వహించారు. కడప నగరంలోని దాదాపు 50 ఆలయాలలో ఆంజనేయునికి హనుమజ్జయంతి విశేష పూజలు చేశారు.



చిన్నచౌకులోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామికి విశేష అలంకారం

- కడప నగరం పాత బస్టాండువద్దగల శ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం 5.00 గంటల నుంచి పూజలు ప్రారంభించారు. అభిషేకం, అలంకారం అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.
- కడప నగరం బిల్టప్ సమీపంలోని హోమియోపతి కళాశాల ఎదుట వెలసిన శ్రీ ఆంజనేయ స్వామికి ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నిర్వాహకులు గుగ్గుళ్లు, చెక్కర పొంగలి, పెరుగన్నం పంపిణీ చేశారు. వై.రమణస్వామి, కె.కృష్ణమాచారి, పి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



హోమియోపతి కళాశాల వద్ద ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కడప కార్పొరేషన్: హనుమాన్ జయంతి ఉత్సవాలు కడపలో ఘనంగా జరిగాయి. ఆదివారం స్థానిక వక్కలపేటలో వెలసిన ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో అసిస్టెంట్ సిటీప్లానర్ నాగేంద్ర ఆధ్వర్యంలో మేయర్ కె. సురేష్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2వేల మందికి భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనాలు ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ప్రసన్న ఆంజనేయస్వామిని దర్శించుకొని అన్నదాన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. విజయ దుర్గాదేవి ఆలయ వ్యవస్థాపకులు దుర్గా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్‌రావు, కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జులు సుదర్శన్‌రెడ్డి, రెడ్డిప్రసాద్, సుబ్బరాయుడు, టౌన్‌ప్లానింగ్ సూపరింటెండెంట్ జి. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

- హనుమాన్ జయంతి సందర్భంగా చిన్నచౌకులోని ఆంజనేయస్వామి గుడిలో మేయర్ సురేష్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ఉత్సవ అలంకారంలో నెహ్రూనగర్ పంచముఖ ఆంజనేయస్వామి

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

వల్లూరు : మండలంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని వల్లూరు, గోటూరు, పెద్దపుత్త, పాపాఘ్ని నగర్, కుమారునిపల్లె గ్రామాలలో భక్తులు తెల్లవారు జామున నుంచే ఆంజనేయ స్వామి ఆలయాలకు చేరుకుని పంచామృత అభిషేకాలు నిర్వహించారు. వల్లూరు, గోటూరు తదితర గ్రామాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. పెద్దపుత్తలో గ్రామోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. గోటూరులో బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

చెన్నూరు : స్థానిక బ్రాహ్మణవీధిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలను ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలో హనుమజ్జయంతి సందర్భంగా భక్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. బుడ్డాయపల్లి వద్ద అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి కార్యక్రమాలలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి



కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె కళాతరంగిణి సంస్థ సభ్యులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. ముఖ్యంగా ఇటీవల ప్రాచుర్యం పొందిన సినీ గీతాలకు నృత్యాలు ప్రదర్శించడంతో వారిని పదేపదే అభినందిస్తూ కరతాళ ధ్వనులతో ప్రోత్సహించారు. ప్రేక్షకులు కోరిన పాటలకు కళాకారులు నృత్యాలు ప్రదర్శించారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట-బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్య నిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో బంధుమిత్రులతో విందుభోజనాలను చేశారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వీరపునాయునిపల్లె : మండలంలోని యు.రాజుపాలెం సచివాలయ పరిధిలోని తాటిమాకులపల్లె, కదిరేపల్లె, రాజుపాలెం గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డిలు పాల్గొంటారని మండల కన్వీనర్ రఘునాథరెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చుక్కల భూముల నుంచి రైతులకు విముక్తి

- రాష్ట్ర ఉద్యాన శాఖ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాదొరెడ్డి

చాపాడు: దశాబ్దాలుగా రైతులు చుక్కల భూములతో పడుతున్న సమస్యలకు పరిష్కారం చూపుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్య హర్షనీయమైనదని రాష్ట్ర ఉద్యానశాఖ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలతో పేర్కొన్నారు. చుక్కల భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు పూర్తి హక్కులు కల్పించటం జరుగుతుందన్నారు. రెవెన్యూ రికార్డులలో ఏదో ఒక దానిలో రైతు పేరు నమోదు అయి ఉండటం, రైతు వద్ద పట్టాదారు పాసుపుస్తకం ఉండటం, రైతు వద్ద వంశపారంపర్య దస్తావేజులు లేదా రాసుకున్న అగ్రిమెంట్లు, రైతు 2017కు ముందు 12 ఏళ్ల భూమి సాగుదారుడిగా ఉండటం ఇంకా పలు రకాలైన అనుభవదారులైన రైతులకు చెందిన చుక్కల భూములను పట్టా భూములుగా మారతాయన్నారు. గొప్ప నిర్ణయాన్ని సీఎం జగన్ తీసుకున్నారన్నారు.

లౌకికవాదానికి కర్ణాటక ఓటర్ల పట్టం



మాట్లాడుతున్న జి. ఈశ్వరయ్య

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కర్ణాటక ప్రజలు లౌకికవాదానికి పట్టం కట్టారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో కులం, మతం, దేవుని పేరుతో, దేశ భక్తి పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూసిన బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. బీజేపీ ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలు ఇచ్చి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. సంస్కరణల పేరుతో చట్టాలను సమూలంగా మార్పులు చేసి దోపిడీకి ద్వారాలు తెరిచిందని ధ్వజమెత్తారు. దళితులు, మైనార్టీలపై సంఘ్ పరివార్ సాగిస్తున్న ఆకృత్యాలను మోదీ ప్రభుత్వం పెంచి పోషించిందన్నారు. ఇప్పటికైనా దేశంలో లౌకిక ప్రజాస్వామ్యం కోసం, సమైక్యత సమగ్రత కోసం, బీజేపీయేతర శక్తులన్నీ ఏకం కావాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, నాయకులు మహేష్, కెసీ బాదుల్లా, సుబ్బారెడ్డి, వలరాజు పాల్గొన్నారు.

కర్ణాటక ఫలితం బీజేపీకి గుణపాఠం

కర్ణాటక ఎన్నికల ప్రజాతీర్పు బీజేపీకి గుణపాఠం అని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అంబానీ, అదానీలకు కట్టబెడుతున్న ప్రధాని మోదీని గద్దెదించే సమయం ఆసన్నమైందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక మన రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు.

ఆంగ్లం ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలు



ఆంగ్లభాష గురించి తెలియజేస్తున్న శిక్షకులు సత్యవతి

కడప కల్చరల్ : ఆంగ్లంలో పట్టు సాధించగలిగితే ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభించగలవని స్పోకన్ ఇంగ్లీషు కోర్సు శిక్షకులు సత్యవతి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆమె స్పోకన్ ఇంగ్లిష్ వల్ల విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆంగ్లభాష ఆవశ్యకత నానాటికి పెరుగుతోందని, దీన్ని సులభంగా నేర్చుకునేందుకు స్పోకన్ ఇంగ్లీషు ఉపయోగపడగలదన్నారు. ఏ భాషలోనైనా తరుచుగా వాడే ముఖ్యమైన చిన్న పదాలు ఉంటాయని, వాటిపైన అవగాహన కలిగి ఉంటే ఆ భాష నేర్చుకోవడం సులభమన్నారు. గణితంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి ఆర్.వాసుదేవ్ కఠినమైన గణితం సమస్యలను సులభశైలిలో పరిష్కరించుకోవడం గురించి తేలిక మార్గాలను వివరించారు. గణిత సమస్యల పరిష్కారం, మెదడుకు సంబంధించి ఉత్తమ వ్యాయామాలలో ఒకటని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసక్తిగల రంగంలో కృషి చేస్తే విజయం తథ్యం

కెరీర్ గైడెన్స్ నిపుణులు



మాట్లాడుతున్న మహమ్మద్ అబ్దుల్ హమీద్

కడప కల్చరల్ : ఆసక్తిగల రంగంలో కృషి చేస్తే విజయాలు తప్పక లభిస్తాయని ప్రముఖ కెరీర్ గైడెన్స్ నిపుణులు సూచించారు. జమా అతె ఇస్లామి హింద్, స్టూడెంట్‌ఇస్లామిక్ ఆర్గనైజేషన్ సంస్థ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం కడప నగరం బెల్లంమండివీధిలోని జహారా మదరసాలో కెరీర్ గైడెన్స్‌తోపాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ గురించి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఉస్మానియా విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఆచార్యులు మహమ్మద్ అబ్దుల్ హమీద్ మాట్లాడు తూ టెన్త్, ఇంటర్మీడియేట్ పాసైన వారు తమ సీనియర్ల సలహాలు తీసుకుంటారని, నిజానికి ప్రతి విద్యార్థి తన పరిస్థితి, అభిరుచికి అనుగుణంగా ఎంపిక చేసుకున్న రంగంలో కృషి చేసినపుడే విజయం సాధించగలమన్నారు. హెచ్‌పీసీఎస్ డైరెక్టర్ సయ్యద్ యూనుస్ మాట్లాడుతూ విద్యార్థులు కీలకమైన టెన్త్, ఇంటర్ దశల్లో తమ ప్రతిభా శక్తులను గుర్తెరిగి ఉన్నత చదువులు సాధించాలని, ఈ దశలో పొర పాటు చేస్తే జీవితాంతం బాధపడాల్సి వస్తుందన్నా రు. సౌదీ అరేబియాకు చెందిన కింగ్ ఫహద్ విశ్వవిద్యాలయం ఆచార్యులు సుహైల్ హుసేన్ మాట్లాడారు. విశేష సంఖ్యలో విద్యార్థులు జమాఅతె ఇస్లామి హింద్ బాధ్యులు అక్రమ్ హుసేన్, జాకీర్, రహమతుల్లా పాల్గొన్నారు.

ముగిసిన సుంకులమ్మ తిరునాల

కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువు కట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మ తిరునాల ఘనంగా ముగిసింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న సుంకులమ్మ అష్టమ బ్రహ్మోత్సవ తిరునాల మహోత్సవం ఆదివారం వైభవంగా ముగిసింది. ఉదయం ప్రాతఃకాల పూజలతో కార్యక్రమాలు ప్రారంభించారు. ప్రముఖ వేద పండితులు సరసా శివకుమార్ శర్మ, నాగశయన శర్మ ఆచారత్వమున అమ్మవారికి అభిషేకాలు, మంగళ హారతి, రుద్ర హోమము, పూర్ణాహుతి, కుష్మాండబలి, క్షజ్వాల, మహా ప్రసాద నివేదనము, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. పట్టణం నుంచే కాక సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు చవ్వారెడ్డి రామసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం

ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవంలో పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాల నడుమ యువత నృత్యాలు చేశారు. ఊరేగింపులో భజన బృందం చేసిన భజన, కోలాటం భక్తులను విశేషంగా అలరించింది. తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ సలహాదారుడు రాజోలి వీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో వారికి స్వాగతం పలికారు. సీఎస్ నారాయణరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వారికి సన్మానించారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

కమలాపురం : పట్టణంలోని చెరువు కట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మ అష్టమ తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకు ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు పోటా పోటీగా సాగాయి. ఆదివారం నిర్వహించిన సీనియర్ కేటగిరి బండ లాగుడు పోటీలను ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. రాష్ట్రం లోని వివిధ లల్లాల నుంచి వచ్చిన ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లు అత్యధికంగా 2164 అడుగులు రాతిదూలాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన ప్రసన్నరెడ్డి కంబైన్డ్ నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన శ్రీరాములు యాదవ్ ఎడ్లు 1927 అడుగులతో ద్వితీయ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన గురునాథ్ ఎడ్లు 1759 అడుగులతో తృతీయ స్థానంలో, బాపట్ల జిల్లా బల్లి కురువకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి, ప్రకాశం జిల్లా రాచర్లకు చెందిన బాలరాజు ఎడ్లు 1500 అడుగులతో నాల్గవ స్థానంలో, బాపట్ల జిల్లా బల్లికురువకు చెందిన పావులూరి వీరా స్వామి చౌదరి ఎడ్లు 1338 అడుగులతో ఐదవ స్థానంలో, నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన చిన్న నాగన్న, అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన జయరామిరెడ్డి కంబైన్డ్ ఎడ్లు 1269 అడుగులతో ఆరవ స్థానంలో నిలిచాయి. వారికి వరుసగా రూ.1.50లక్షలు, రూ.1లక్ష, రూ.75వేలు, రూ.50వేలు, రూ.25వేలు, రూ.15వేలు నగదు బహుమతులు అందజేశారు.


విజయవాడలో మహా యజ్ఞానికి తరలిరండి

కడప కల్చరల్ : రాష్ట్ర ప్రభుత్వం లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న మహా యజ్ఞానికి జిల్లా వాసులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని వైఎస్సార్ జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ పిలుపునిచ్చారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న అత్యంత అరుదైన శతకుండాత్మక, చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మి మహాయజ్ఞం అత్యంత పవిత్రంగా వేద పండితులతో నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా నుంచి ఇప్పటికే ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనే అరుదైన అవకాశాన్ని పలువురు భక్తులు వినియోగించుకున్నారని, జిల్లా వాసుల్లో మిగతా భక్తులు కూడా ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ హోమంలో పాల్గొనేందుకు ఎలాంటి టిక్కెట్, పాసు అవసరం లేదని, జిల్లా వాసులకు తాను స్వయంగా స్వాగతం పలికి హోమం ప్రాంతాన్ని సందర్శింపజేసేందుకు కృషి చేస్తామన్నారు. బుధవారం వరకు ఈ యజ్ఞాలు కొనసాగుతాయని తెలిపారు. జిల్లాకు చెందిన భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఫుట్‌బాల్... ఫుల్ జోష్



ఫుట్‌బాల్ శిక్షణలో చిన్నారులు



కడప స్పోర్ట్స్: క్రీడల్లో ఫుట్‌బాల్‌ది ప్రత్యేకస్థానం. దేహదారుఢ్యం, వేగం, వెంటవెంటనే స్పందించే నైజం ఈ క్రీడ సొంతం. అంతర్జాతీయస్థాయిలో ఫుట్‌బాల్‌కు ఉండే గుర్తింపు మరే క్రీడలకు లేదనడం అతిశయోక్తి కాదు. జిల్లాలో ఈ క్రీడపట్ల యువతలో మక్కువ పెరుగుతోంది. కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాలకు చిన్నారుల నుంచి చక్కటి స్పందన లభిస్తోంది.

శిక్షణ సాగుతోందిలా..

వేసవి శిక్షణ శిబిరాల్లో చిన్నారులకు ప్రాథమిక అంశాలు మొదలుకుని క్రీడలో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలను తెలియజేస్తున్నారు. శాప్ ఆధ్వర్యంలో మే 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ శిక్షణ శిబిరంలో సీనియర్ క్రీడాకారుడు సాయి సునీల్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఫిట్‌నెస్ మొదలు ప్రాథమిక అంశాలు, పాసింగ్, ట్రాకింగ్, కంట్రోలింగ్, డ్రిబ్లింగ్, పొజిషన్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. గోల్‌కిక్, కార్నర్‌కిక్, డైరెక్ట్ కిక్, పెనాల్టీ కిక్‌లను నేర్పుతున్నారు. అదే విధంగా ఫుట్ వర్క్, గోల్‌కీపింగ్, చెస్ట్ ట్రాప్, ఫుట్‌ట్రాప్, త్రోఇన్, పుష్ పాస్, హెడింగ్ తదితర అంశాల్లో మెళకువలు నేర్పుతున్నారు. వీటితో పాటు ఆటకు సంబంధించిన నియమ నిబంధనలను తెలియజేస్తున్నారు. కాగా ఫుట్‌బాల్ క్రీడను సాధన చేయడం ద్వారా ఎక్కువ కిలో క్యాలరీల శక్తి ఖర్చవుతుంది. రోజూ గంటపాటుసాధన చేస్తే 150 నుంచి 200 కిలో కేలరీలు ఖర్చవుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

ఆర్టీసీ బస్టాండులో శ్రమదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప ఆర్టీసీ బస్టాండులో ఆదివారం వరల్డ్ మిషన్ సొసైటీ చర్చి ఆఫ్ గాడ్ సంఘ సభ్యులు స్వచ్ఛందంగా శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కడప ఆర్టీసీ డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు మాట్లాడుతూ 1964వ సంవత్సరంలో ద వరల్డ్ మిషన్ సొసైటీ చర్చి ఆఫ్ గాడ్‌ను స్థాపించారన్నారు. ఈ సంస్థలో 40 లక్షల మంది సభ్యులుగా ఉన్నారన్నారు. సంస్థ ప్రతినిధి నజీర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 170 దేశాలలో 4.5 మిలియన్ ప్రజలు తమ సంఘంలో సభ్యులుగా ఉన్నారన్నారు. ఈ విధంగా ఆయా ప్రాంతాల్లో శ్రమదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

విద్యతో పాటు నైతిక విలువలు అవసరం

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలను అలవర్చుకోవాలని యోగి వేమన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్.ఈశ్వర రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మధురసాయి ఐటీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఆదివారం వెంకటేశ్వర డిగ్రీ కళాశాల 18వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలకు త్వరలో న్యాక్ గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు నిరాశను వదిలిపెట్టి విజయం కోసం కష్టపడాలని సూచించారు. కరస్పాండెంట్ హరినారాయణ మాట్లాడుతూ 2005లో కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి విద్యార్థుల విద్యాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం చదువులో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నగదు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వైవీయూ పాలకమండలి సభ్యుడు సుబ్బారెడ్డి, పరమేశ్వర డిగ్రీకళాశాల కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ ముస్తఫా, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ గౌరీశంకర్, వైస్ ప్రిన్సిపాల్ భవాని, ఇన్‌చార్జి ప్రినిపాళ్లు శ్రీకాంత్‌రెడ్డి, రాంమోహన్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.